క్లుప్తంగా

ముగిసిన నామినేషన్ల పర్వం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల నామినేషన్ల పర్వం శనివారం ముగిసింది. నలుగురు అభ్యర్థులు అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారని ఎన్నికల అధికారి పోతురాజు నర్సింగరావు, సహాధికారులు మధు, చంద్రశేఖర్ తెలిపారు. బండ యాదగిరి, ఎస్‌రాజుచారి, బి. సాంబ, బి. వెంకటరమణలు నామినేషన్ వేశారు. ఈ నెల 10న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట అంజయ్యనగర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద మధుకర్ మాదిగ, బ్యాగరి నర్సింహ మాదిగ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 13న ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పెన్షన్ దారుల మహాగర్జనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కవిత, మమత, సరిత, అనూష రసమల్ల యాదగిరి మాదిగ, సిలువేరు శ్రీనివాస్, రమేష్, అనిల్, రమేష్, శ్రీను, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ బిక్స్ డైరెక్టర్‌పై ఫిర్యాదు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లోని బిక్స్ విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు అవినీతి, టెండర్లలో అక్రమాలపై జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి సంఘాల నాయకులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు శనివారం ఫిర్యాదు చేశారు. అవినీతికి అవకాశం లేకుండా నిబంధనలు అమలు చేయాలని కోరారు. విశ్వవిద్యాలయ భవనాలు, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక వసతుల పరిస్థితి బాగోలేదని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎస్.కరుణాకర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, తేజ, దిలీప్, జగన్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవం సందర్భంగా సన్మానం



ఆల్విన్‌కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ మూడవ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం రజతోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావును సన్మానించారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, కార్యదర్శి జి.పి. కోటేశ్వరరావు, క్రీడా శాఖ కార్యదర్శి సి. సదాశివరెడ్డి, కోశాధికారి వెంకటయ్య, సభ్యులు నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కమ్యూనిటి హాల్‌లో అపోలో క్లీనిక్, అవంతి నగర్ తోట సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మధుమేహం, బీపీ, నేత్ర, దంత, చర్మ వ్యాధులతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీష్‌కుమార్



కూకట్‌పల్లి: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పర్వత సతీష్ కుమార్ పటేల్ ఎన్నికయ్యారు. వేల్పుల శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన జవహర్‌నగర్, కీసర మండల మున్నూరు కాపు సంఘం రాష్ట్ర పదాధికారు కర్రీ వెంకటేశ్వర్లు పటేల్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు పటేల్, ఆకులు సత్యనారాయణ పటేల్, బొశెట్టి నర్సింగరావు పటేల్ తదితరులు సన్మానించారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

- నాడు బస్టాప్ కోసం స్థలం కేటాయింపు
- అడ్డదిడ్డంగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధించినా మార్పు అంతంతే



ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌లో అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

ఆల్విన్‌కాలనీ: బస్టాప్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వాహనాల అక్రమ పార్కింగ్‌తో ఆర్టీసీ బస్సులకు, ప్రయాణికులకు ఆటంకం కలుగుతున్నది. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌బేల వద్ద బస్సులు నిలిపే స్థలాన్ని ప్రైవేట్ వాహనదారులు ఆక్రమించుకుంటున్నారు. ఆర్టీసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా ప్రైవేట్ వాహనదారుల పద్ధతి మారటం లేదు. కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని చివరి బస్టాప్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులు రద్దీగా ఉండే వేళల్లో ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీ ఏర్పడి సుమారు 40 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతం ఓ చిట్టడవిలా ఉండేది. ఆల్విన్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు నగరానికి వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పి. జనార్ధన్‌రెడ్డి హయాంలో ఆర్టీసీ బస్సులు నడిచేలా కార్మికుల సౌకర్యార్థం కృషి చేశారు. బస్సులు పార్కింగ్ చేయడానికి ఈ స్థలం అనువుగా ఉందని బస్టాప్ స్థలంగా ఉపయోగంలోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ స్థలం కావటంతో బస్టాప్ కోసమే ఉండాలని పలువురు ఈ స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడుకుంటూ వచ్చారు. జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ, కేపీహెచ్‌బీ కాలనీలోని ఇతర ప్రాంతాల వారు తీసుకువచ్చి ఇక్కడ పార్కింగ్ చేస్తున్నారని, వాహనాలను తీసివేయాలని ఎవరిని అడిగినా ఇక్కడ వాళ్లు ఉండటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో ట్రాఫిక్ పోలీసులు వారం రోజుల పాటు చలాన్లు విధించినా మార్పు రాలేదు. ఇదే అదునుగా చూసి కొంతమంది కబ్జాదారులు ఈ ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి స్థలంలో ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేయకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బోర్డులు ఏర్పాటు చేసి బస్‌లు నిలిపేందుకు అనువుగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బస్టాప్‌లో అక్రమ పార్కింగ్ చేయటంతో బయటే నిలిపిన బస్సులు

చర్యలు తీసుకోవాలి



ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌లో ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌తో ఆర్టీసీ డ్రైవర్లు ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలోనే బస్సులను ఆపాల్సి వస్తుంది. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఈ ప్రాంత ప్రైవేట్ వాహనదారులు కాకపోయినప్పటికీ ఎక్కడి వారో ఇక్కడ పార్కింగ్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారులు బస్టాప్‌లో పార్కింగ్ చేసే ప్రైవేట్ వాహనాలపై చలాన్లు విధించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. –చంద్రశేఖర్ రెడ్డి, స్థానికుడు

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



ఎమ్మెల్యే కృష్ణారావును ఆశీర్వదిస్తున్న అర్చకులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కళాశాలలో పెరుగుతున్న అడ్మిషన్లు

- మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 20 వరకు అడ్మిషన్ల ప్రక్రియ
- ఇప్పటికే రెండో సంవత్సరంలో 364 మంది విద్యార్థులు

రాయదుర్గం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోజు రోజుకూ చేరికలు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 408 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరారు. కాగా ఇప్పటికే ద్వితీయ సంవత్సరంలో 364 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అంటే కళాశాలలో ఇప్పటివరకు మొత్తం విద్యార్థుల సంఖ్య 772 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు నిర్వహిస్తుండగా కొత్తగా ఈ ఏడాది నుంచి హెచ్‌ఈసీ కోర్సును ప్రారంభించారు. కాగా కంప్యూటర్‌సైన్స్‌లో ఒకేషనల్ కోర్సును కూడా నిర్వహిస్తున్నారు. కళాశాలకు సొంత భవనం ఉండగా సౌకర్యాలు ఏటేటా మెరుగుపడుతున్నాయి.

20 వరకు చేరికలకు అవకాశం..

మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేందుకు ఈ నెల 20వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఇప్పటి వరకు 408 మంది మొదటి సంవత్సరంలో చేరారని గుర్తు చేశారు. మరింత మందికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన వారికి బస్‌పాస్, ఉపకారవేతనాలు అందిస్తామన్నారు.



మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

గణేష్ నవరాత్రి ఉత్సవాల కమిటీ ఎన్నిక

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వినాయక భక్త బృందం వారి 2025 గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కమిటి శనివారం చైర్మన్ నాయినేని సూర్య ప్రకాష్‌రావు సమక్షంలో నియమించారు. 49 సంవత్సరాల నుంచి భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకుంటూ 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా జరపాలని కమిటీ చైర్మన్ సూచించారు. 2025 గణేష్ ఉత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా రంభప్పగారి రంగారావు, కన్వీనర్‌గా చౌదరి సూర్యారావు, కోశాధికారిగా అర్సనపల్లి సూర్యారావు, సలహాదారులుగా అంతయ్యగారి జలంధర్ రావు, నాయినేని పద్మారావు, చౌదరి నర్సింగరావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జి. వెంకట్‌రావు, ఏ. వెంకటస్వామి, ఎమ్. ప్రకాష్‌రావు, సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా జి. పాపారావు, వై. పద్మయ్య, వి. శ్రీనివాస్‌రావు, అనంత నాగరాజు, కార్యదర్శులుగా డి. వెంగళ్‌రావు, ఈ. సాయి కుమార్, వై.మల్లేష్, వెంకట్‌రెడ్డి, దిలీప్, కృష్ణ ప్రియ, సభ్యులుగా బి. ఉదయ్‌కుమార్, కె. రాఘవేంద్ర, నర్సింగ్‌రావు, సంతోష్, భాస్కర్‌గౌడ్, నర్సింగ్‌రావు, మంజునాథ్, ఎస్. భారత్ నియమింపబడ్డారు.

శ్రావణమాస బోనాలు



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో శ్రావణమాసం బోనాల ఉత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయం తెలిపే ఆటలు, పాటలతో నృత్యాలు చేశారు. అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థినులు బోనాలను తయారు చేసి రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో సమర్పించారు. కార్యక్రమంలో ప్రగతి ఉమెన్స్ కళాశాల, చందానగర్ ప్రిన్సిపాల్ ఇందిర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలబార్‌లో ఆభరణాల ప్రదర్శన



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యతతో కూడినవన్నారు. నగిషీ చెక్కిన ప్రతి ఆభరణం తయారు చేసినవారి అనుభవం ఇంకా కళాత్మకతకి నిదర్శనమని తెలిపారు. ఎరా అస్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి, పైష్యా, జాతి రత్నాభరణాల సముదాయం, ఎత్నిక్స్ హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు, డివైన్ భారతీయ ప్రాచీన సంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు, చిన్నారుల కోసం స్టార్లెట్ పిల్లల ఆభరణాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు. బంగారు ఆభరణాలు, రత్నాభరణాలపై తరుగు ఛార్జీలపై ఫ్లాట్ 30 శాతం తగ్గింపు, వజ్రాభరణాల వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు ఉంటుందన్నారు. ఆగస్టు 8వ తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీ నుంచి శాంతినగర్ కాలనీకి వెళ్లే కాలనీ రోడ్డులో ఎస్టీపీ పైపులైన్ పనుల మరమ్మతులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీపీ పైప్‌లైన్ మరమ్మతుల్లో జాప్యం వహించకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మళ్లీ సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యాన్‌హోల్‌లో చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి మురుగు నీరు సాఫీగా పారేలా చర్యలు చేపట్టాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఇప్పటికే నిధులు మంజురయ్యాని, వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ.. సన్మానం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో నివాసముండే వినోద్–వరలక్ష్మి దంపతుల కుమార్తె ప్రదీక్ష కేరళ రాష్ట్రంలో జరిగిన ఆల్ ఇండియా క్లాసికల్ డ్యాన్స్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం సన్మానించారు. మానసా స్కూల్ ఆఫ్ డాయన్స్ అకాడమీ ప్రణవి సహకారంతో చిన్నారి ప్రదీక్ష ఈ ఘనత సాధించిందని తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో జగదీష్, మొజెస్, సత్యనారాయణ, లింగం, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రదీక్షను సన్మానిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

మహిళా సాధికారతకు కృషి

మహిళా సంఘాలకు రుణ లక్ష్యం ఖరారు

- బ్యాంకు లింకేజీ ద్వారా రుణ లక్ష్యం రూ.197.85 కోట్లు
- పంపిణీ చేసిన రుణాలు రూ.38.85 కోట్లు
- 2,612 సంఘాలకు రుణంపై డీఆర్‌డీఏ ప్రణాళిక



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళా సంఘాలకు ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని నిర్దేశించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 5 మండలాల్లో 2,612 సంఘాలకు రూ.197.74 కోట్ల లింకేజీ రుణాన్ని మంజూరు చేసేలా ప్రణాళికను రూపొందించారు. గతేడాది జిల్లాలో 2,794 మహిళా సంఘాలకు రూ.197.85 కోట్ల బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం కాగా.. రూ.211.95 కోట్ల (108శాతం) రుణాలను పంపిణీ చేయడంతో పాటు రికవరీలోనూ ప్రగతిని సాధించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత రుణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆర్థిక భరోసాకు ప్రోత్సాహం..

ఇప్పటి వరకు 618 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.38.85 కోట్ల రుణాలకు బ్యాంకు లింకేజీ కింద అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివ రావు పేర్కొన్నారు. ఇది వరకు ప్రభుత్వం ద్వారా రుణాలను తీసుకున్న వారందరూ తమ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునేలా నూనెలు, కిరాణాలు, పప్పుల మిల్లులు, ఇతరత్రా ఉప ఉత్పత్తుల తయారీలో భాగంగా భిన్నమైన యూనిట్లను నెలకొల్పుకున్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. మరో వైపు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి సంఘాల ఖాతాలో జమచేయాల్సి ఉండగా.. దాదాపుగా మూడేళ్ల వడ్డీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని, వడ్డీలేని రుణ పథకాన్ని చేపడతామన్న కొత్త ప్రభుత్వం ప్రకటన అమలుతో మహిళా సంఘాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రోత్సాహకరంగా ఉండనున్నట్లు డీఆర్‌డీఏ పేర్కొంటోంది.

మండలాల వారీగా రుణాల పంపిణీ ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 5 మండలాల పరిధిలోని 618 మహిళా స్వయం సహాయ సంఘాలకు ఇప్పటి వరకు రూ. 38.85 కోట్ల పంపిణీ చేయగా.. మండలాల వారీగా రుణాల పంపిణీ ఈ విధంగా ఉంది.

◆ ఘట్‌కేసర్ మండలంలోని 133 మహిళా సంఘాలకు రూ.10.64 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయగా.. కీసర మండలంలోని 101 మహిళా సంఘాలకు రూ.5.88 కోట్లు, మేడ్చల్ మండలంలోని 184 సంఘాలకు రూ.11.11 కోట్లు, ఎంసీపల్లి మండలంలోని 96 సంఘాలకు రూ.4.54 కోట్లు, శామీర్‌పేట మండల పరిధిలోని 104 స్వయం సహాయ మహిళా సంఘాలకు రూ.6.68 కోట్ల రుణాలను అందజేశారు.

కుంగిన మ్యాన్‌హోల్.. పట్టించుకోని సిబ్బంది



నిజాంపేట్: విజయపురి కాలనీ, ఎన్టీఆర్ నగర్ మీదుగా ప్రగతినగర్ వెళ్లే రోడ్డు శ్రీరాగా అపార్ట్‌మెంట్ కూడలిలో మ్యాన్‌హోల్ కుంగిపోయింది. రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూనే ఉంది. దీంతో వాహనదారులు, అలుగా వెళ్లేవాళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుంగిన మ్యాన్‌హోల్‌ను సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టి ఈ సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ పరిధిలోని ఆర్ఎన్‌జీ సుప్ర అవెన్యూ వాసులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. హన్మంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీ వాసులు